# హారీన్

## సౌదా

28-4-97
హైదరాబాదు

వొక విచిత్రవ్యక్తి తగిలాడు నిన్న సిటీబస్సులో. స్నేహం కూడా అయింది. యీ హైదరాబాదులో యిన్నాళ్ళకు వొక ముక్కూమొహం తెలీని వాడితో నేరుగా స్నేహం. అది స్నేహమంటావా?

అతని నుంచి సన్నాయి వాద్యం వొస్తోంది. బాగా తాగిన వాసన. పక్కనే కూచున్నాడు. మా తిరపతిలో కొండమీద మైకుల్లో యిట్టాంటి సన్నాయి పెద్దపెద్ద పేరున్న వాళ్ళది వేస్తుంటారు. అతని దగ్గిర యే వాద్యపరికరం లేదు. కిటికీలోంచి చూస్తూ అమిత వేగంగా నేలలోంచి మొలుచుకొస్తున్న బిల్డింగ్‌లనీ చెట్లనీ చూపుడువేలితో గాలిలో పెయింట్ చేస్తున్నాడు.(యీ మాట అతనే ఆ తర్వాత చెప్పాడు). వేలి కదలికల్ని బట్టి సన్నాయి యెగుడుదిగుళ్లు మారిపోతున్నాయి. ఆ ట్యూన్స్‌లో నేను గుర్తుపట్టినవి కొన్ని వున్నాయ్. త్యాగరాజస్వామి నగుమోముకనలేని అన్నమయ్య బండి విరిచీ గద్దర్ సిరిమల్లె చెట్టుకింద. ఆ రేంజ్ అనంతంగా వుంది. నా అనుమానం అతను ముక్కుతో పాడుతున్నాడేమోనని. అచ్చం సన్నాయే అనుకో. యే నాటిదో యెన్నాళ్ళదో ప్రాక్టీసు అనిపిస్తుంది. నాకు వొక్కడికే వినిపిస్తోంది అనుకుంటా. యెవరూ అతనికేసి చూడ్డం లేదసలు.

-నన్నెందుకు అట్టాచూస్తున్నావ్. నాపేరు హారీన్. విజయనగరం దగ్గిర మావూరు. నేను రోడ్‌నంబరు ఫార్టీసిక్స్‌దగ్గిర దిగి ఆటోలో వోపన్ యూనివర్శిటీ వెళ్తున్నాను. సబ్జెక్టు మార్పించుకోడానికి. వివరాలు చాలా. యింక నావైపు అట్టా చూడొద్దు- అన్నాడు. Don't stare at strangers like me అని నువ్వొకసారి రాసిన మాట గుర్తుకొస్తోందిప్పుడు యిది రాస్తుంటే. అప్పుడు నువ్వు స్ట్రేంజర్‌వే అనుకో-కాకపోతే నేను. అయినా ఆ బుద్ధిపోలేదు నాకు యిట్లా తిట్టిచ్చుకోడానికి.

అప్పుడు చూశాను అతను తొడుక్కున్న చొక్కా. లంబాడీల అద్దాల జాకెట్టది. చాలా పొడుగ్గా వుంది. నా మొహాలు లెక్కలేనన్ని కనిపిస్తున్నాయి వాటిలో. నువ్వంటావే...వొద్దులే. యిక్కడ యింకో సంగతి జరిగింది. అది మళ్ళీ రాస్తాను.


-యే సబ్జెక్టుకు మారుతున్నారు? యేం లేదు. అక్కడ వుర్దూ డిపార్ట్‌మెంట్‌లో నా ఫ్రెండొకాయన టీచ్ చేస్తున్నాడు అన్నాను.

విన్నాడో లేదో.

సన్నాయి యిప్పుడు- తోటలో నారాజు కొచ్చింది. సర్రుమని దిగిపోయింది గౌరవం ఆ సన్నాయి మీద.

-మీది యే సబ్జెక్టు? అని రెట్టించాను.

వేలికదలికల్ని బట్టి
సన్నాయి యెగుడుదిగుళ్లు
మారిపోతున్నాయి. ఆ
ట్యూన్స్‌లో నేను గుర్తుపట్టి
నవి కొన్ని వున్నాయ్.
త్యాగరాజస్వామి నగుమో
ముకనలేని అన్నమయ్య
బండి విరిచీ గద్దర్
సిరిమల్లె చెట్టుకింద.




- మేథమెటిక్స్ అన్నాడు.

యీ మాట వింటూండగానే వొక కొత్త సంగతి చూశాను. వొళ్ళు జలదరించిందనుకో. యేమయిందో తెలుసా! అతను మాట్లాడేదానికి సంబంధం లేకుండా సన్నాయి పాటికి సన్నాయి యెక్కడో దూరం నుంచి వినిపించడం. నేను కనిపెట్టింది కంటుగా ఉండాలని కావాలనే యింకొంచెం మాటలు కలిపా.

-యెందుకు మార్చుకుంటున్నారు?

-అయ్ లాస్ట్ బిలీఫ్ యిన్ జీరో.

(సున్న మీద నాకు నమ్మకం పోయింది)

నాకు వెంటనే అర్థం కాలేదు.

-సున్న మీద నమ్మకమా? పోవడమా? అంటే? అన్నాను.

-డోన్ట్ మేకిట్ మొబైల్ యూనివర్సిటీ అన్నాడు. (యీ బస్సును సంచార విశ్వవిద్యాలయం చెయ్యొద్దు)

నేనేం అడిగితే యింకా యేం చికాకు పడతాడోనని గమ్మునే వుండిపోయాను.

-థింక్ యువర్‌సెల్ఫ్ అన్నాడు.

(నీకు నువ్వే ఆలోచించుకో)

యీ మాట్లాడుతున్నంతసేపూ సన్నాయి వినిపిస్తోనే వుంది యెక్కడి నుంచో. అంటే బస్సులోనే యెవరి దగ్గరైనా రేడియో టేప్ రికార్డర్ వాక్‌మన్ లాంటిది వుందేమోనని నిమ్మళపడ్డాను. వాక్‌మన్ మనకు వినిపిస్తుందా?

రోడ్ నంబరు ఫార్టీ సిక్స్ దగ్గర దిగిపోయాడతను.

నేను ఆ తర్వాత చెక్ పోస్టు దగ్గర దిగి యల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నుంచి రాఘవేంద్రరావు వాళ్ళ ఆఫీసులో చినబాబు దగ్గరికెళ్ళి వాడు లేకపోతే ముత్యాల ముగ్గు యింగ్లీషు డబ్బింగ్ ష్వ్రాజ్ నెగ్గర్ దిలే ట్రూ- లైస్ చూసి -యిల్లాలిని తిరిగి యేలుకుంటాడా లేదా అని తెలకముందే చల్లగా జారుకుని వాడిపోయిన యెండలో గోల్డ్‌ఫ్లేక్ తో నడుస్తూన్నాను .

సంత్ నిరంకారీ బాబా బిల్డింగ్ గోడ దగ్గిర యెండ లేదు. పేవ్ మెంట్ మీద పడున్నాడు హరీన్. ఆ. పేరు అదే. అద్దాల చొక్కా చూసీ చూడగానే గుర్తు బట్టాను. తల కింద పొద్దున చూసిన పోలితిన్ కవర్. లోపల కాయితాలున్నట్టున్నాయ్. మొద్దునిద్ర పోతున్నాడు. వయసు పెరుగుతున్నట్టుంది నిద్రలో -రయ్ రయ్‌మనే వాహనాల మధ్యా నల్లటి కాలుష్యం మధ్యా. మొన్న గురువారం యిదంతా జరిగింది. తర్వాత తెలిసింది. ఆ రోజు వోపన్ యూనివర్శిటీ సెలవంట. నేను అక్కడే వూరికే కొంచెం సేపు నిలబడ్డా. గోడ లోపలికి తొంగి చూస్తే సంపెంగ చెట్టు కింద తెల్లటి నాగుపాము పక్కన నులక మంచం మీద మినప వడలు తింటూ యెవడో శ్రీహర్షుడి మాదిరిగా వున్నాడు. యిద్దరూ భయంతో బిర్రబిగుసుకుని వున్నారు. తమాషాగా అనిపించింది. యింతలో సన్నగా నా వెన్ను పాము సరసరమంది. అది సన్నాయి. మళ్ళీ అదే. పొద్దున బస్సులో విన్నది. తిరిగి చూస్తే హరీన్ గాఢంగా నిద్దర తీస్తున్నాడు. నేను తెగించి అతని మొహం మీద మొహం పెట్టి విన్నాను సన్నాయి రహస్యం తెలుసుకోవాలని . యెగశ్వాసా దిగశ్వాసా సన్నటి గురకా తప్ప యేం లేదు. కానీ పక్కనుంచి గంట కొట్టినట్టుగా సన్నాయి. యిప్పుడు పెనవేసుకుంటోంది గానీ వరస తెలివిడి కావడం లేదు. హరీన్ బస్సు దిగి పోయింతరువాత సన్నాయి వినడం మళ్ళీ యిదేనని గుర్తు చేసుకున్నా. నేను వింత పడుతుండగానే లేచాడు హరీన్. అతను అక్కడ అట్లా నిద్రలో వుండగా వొచ్చి చూసి అవమానించానేమోనని తట్టింది నాకు.

-హలో హరీన్ అన్నాను ఏదో వొకటి అనాలని.

హలో సొదా అన్నమాట బాంబులాగా పేలింది నామీద.

-నాపేరు నీకెట్లా తెలుసు అని అడిగాను.

-నేనేమీ అనలేదే. నువ్వే విన్నావు అన్నాడు.

pardon అన్నాను.

- నీపేరు నువ్వే విన్నావు . అందుకే అడుగుతున్నావు అన్నాడు.

-నాకు అయోమయంగా వుంది. పొద్దున్నుంచీ నీదగ్గర సన్నాయి వినిపించడం కూడా మిస్టరీగా వుంది నాకు అన్నాను.

-వో. అదా. అది నేను వింటున్న సన్నాయి అన్నాడు.

- నువ్వు వింటున్నదా?

-యేదయినా వినిపిస్తేనే వినడం నాకు నచ్చదు. వినబడుతుంది గనుక వినడం కూడా నచ్చదు. దేని నిమిత్తమూ లేకుండా నేను సొంతంగా కొన్ని వినగలను అన్నాడు.

డౌట్ లేదు. యిదేదో అపసవ్యమైన కేసు అనిపించింది.

-అంటే యిందాక నాపేరు నువ్వు అనలేదా? అని అడిగాను.

-పోపో. నీదారిన నువ్వు పో అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. నాకు వెళ్ళి పోవాలనీ వుంది. పోగూడదనీ వుంది. పాలితిన్ కవర్‌తీసుకుని నిలబడ్డాడు హరీన్.

-చాయ్ తాగి డిస్పర్స్ అవుదాం..వోకే? అన్నాను.

- దా అన్నాడు.

హోటల్లో కూచున్నాం.

- యేం కావాలి సార్ అని వినిపించింది.

పక్కన యెవరూ లేరు. యేం అర్థం గాలా.

యెదురుగా హరీన్ నంగి నవ్వు.

-నేను విన్నమాటే నీకు వినిపించి వుంటుంది. యేం కావాలి సార్ అని యిక్కడ యెవరూ అనరు. అయినా ఫర్వాలేదు. నేను వినగలను. నాకు వినిపించింది గనుక నీకూ వినిపించిందేమో అన్నాడు.

యీ మనిషి మాటలు నాకు అర్థం కావాలి అని అనుకోవడం బుద్ధి తక్కువ అనిపించింది. తర్వాత టీ తెచ్చే కుర్రవాడు వొస్తే వన్‌బైటు చెప్పాను.

టీతాగుతూ - అవేమిటి అని అడిగాను.

పాలితిన్ కవర్ లోనుంచి కాయితాలు తీసి బల్లమీద పెట్టాడు.

-చూడొచ్చా అన్నా.

-వూ అన్నాడు

చూస్తే అన్నీ జాబులు!

తల్లికీ తండ్రికీ స్నేహితులకీ- -ఆడస్నేహితులకీ మగ స్నేహితులకీ - రాసినవి. కళ్ళు చెదిరేంత పదును అందం. అక్షరాలు . పాల నురగపై సముద్రపు నీలం. ప్రోజ్‌కీ పోయిట్రీకి అందని భాష. కొన్ని మాటలయినా నేను రాసుకుని వుండాల్సింది. అందులోను పర్సనల్ వుత్తరాలు నాకు చూపించడమే గొప్ప విషయం. యిక యెట్లా రాసుకోను? ఆశ్చర్యం యేమంటే ఆ రాసిన వుత్తరాల్లో వొకటీ రెండు నాకు తెలిసిన పేర్లు కూడా వుండడం. యెప్పటెప్పటివో తేదీలు . నేను పుట్టకముందునుంచీ వున్నాయి. నాకు అర్థం కాలేదు. వాటి నెందుకు పోస్టు చేయలేదో.

- అడ్రసులు తెలీదు అన్నాడు హరీన్.

-తెలీవా? తెలీకుండానే యిదంతా రాశావా?

-ఆ. దొరకలేదు. కొందరు అప్పటికే లేరు.

-లేరా? అంటే?

-లేరు.

-లేరా . లేనివాళ్ళకి రాయడమా, యెందుకు?

-నాకు రాయాలనిపించింది. నాకో గర్ల్‌ఫ్రెండ్ వుంది. యెక్కడుందో తెలీదు. యేమయిందో తెలీదు.యింకో గర్ల్‌ఫ్రెండ్ వుంది. యెక్కడుందో తెలీదు. యేమయిందో తెలీదు. యేం రాయకూడదా వాళ్ళకి? మగ స్నేహితులూ వున్నారు. వాళ్ళూ యేమయ్యారో తెలీదు.యెక్కడున్నారో తెలీదు. మా అమ్మ, మా నాయనా. యెవరో యెత్తుకు పోయారు వాళ్ళని. నేను వాళ్ళ మాటలు వినగలను కానీ వాళ్ళతో మాట్లాడలేను. రాయడం వొకటే వొచ్చు .

నేను వూకొట్టడం కూడా మరిచిపోయాను.

కన్నయ్యా అని వినిపించింది హఠాత్తుగా. అది మా అమ్మ గొంతు . నన్ను పిలుస్తోంది. అది మా అమ్మగొంతే. నన్ను అట్లా పిలిచేది మా అమ్మ వొక్కతే.

-మ్మా అన్నాను పరిసరాలు మరిచి.

అందరూ నన్ను వింతగా చూశారు.

నా అరుపు ఆ హోటల్ గోడల్లోకి ఫర్నిచర్‌లోకి యింకి పోయింది. సిగ్గుతో కళ్ళుదించి వాలుగా చూశాను.

-అది మా అమ్మ పిలుపు . నీకు వినిపించినట్టుంది అన్నాడు హరీన్.

-కాదు.

ఆమె మా అమ్మ? అన్నాను.

ఖాళీగా నవ్వాడు.

యేతావునరా నీ కుదురు అని గింజుకుంటున్నట్టుగా వుంది సన్నాయి. యింకొన్ని జాబులు తిప్పాను.

రసూల్‌కు.

-నీకు రసూల్ తెలుసా? అని వెర్రిగా అడిగాను.

-తెలీదు . జాబు రాయాలంటే తెలియాలా? అన్నాడు. నేనేం చెప్పలేక పోయాను.

అన్నీ 28-12-1991 తర్వాత రాసినవే. దాదాపు డజను పైగా వున్నాయి.

-యేం చేసుకుంటావివి?

-తెలీదు. యెక్కడ పోస్టు చేయాలో తెలీదు. నువ్వు వుత్తరాలు రాస్తుంటావా? అని అడిగాడు నన్ను హరీన్.


-ఆ.

-వాళ్ళ అడ్రసులు తెలుసా నీకు?

- ఆ . తెలుసు.

-యు ఆర్ లక్కీ .యు ఆర్ లక్కీ మాన్.

## అవార్డును మించిన భార్య మెప్పు!



**హిం**దీనటుడు అశోక్‌కుమార్‌కి 1963లో తొలిసారిగా 'రాఖీ' చిత్రంలో ఉత్తమ నటునకు 'ఫిలిమ్ ఫేర్' అవార్డు వచ్చింది. అప్పటికి దాదాపు 20 సంవత్సరాలుగా ఆయన సినిమాల్లో గొప్ప నటుడుగా ఖ్యాతి నొందినా, ఆయన భార్య శోభా గంగూలీ ప్రశంసకు మాత్రం ఎప్పుడూ నోచుకోలేదట. 'ఫిలిమ్ ఫేర్' అవార్డు అందుకొన్నప్పుడు అశోక్ కుమార్‌ను ఆమె " నా జీవితంలో మొదటిసారిగా అశోక్‌కుమార్ అభిమానియ్యాను.." అని మెచ్చుకున్నది. అశోక్ కుమార్‌కి ఫిలిమ్‌ఫేర్ అవార్డుకంటే భార్య పొగడ్త గొప్పదనిపించి, "చూశారా! మొగుడి గొప్పదనాన్ని గుర్తించడానికి పెళ్లానికి ఎంత కాలం పట్టిందో!" అని పొంగిపోయాడు.